# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 22-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి కె.పవన్ కల్యాణ్ చెప్పారు.**

**2.** **నేరాల నియంత్రణలో సాంకేతికత వినియోగం చాలా కీలకమని ఆంధ్రప్రదేశ్ హోంశాఖమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

**3.** **తెలంగాణకు ఆర్ఐడీఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని నాబార్డు ఛైర్మన్ కేవీ షాజీని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి కోరారు.**

**4.** **తెలంగాణలోని గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ రుసుము విధించే ఆలోచన లేదని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.**

**5.** **రాబోయే నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు, తెలంగాణాలో ఈరోజు వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉందని వాతారణ శాఖ పేర్కొంది.**

==========================

రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు, అటవీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి కె.పవన్ కల్యాణ్ చెప్పారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో నిన్న ఆంధ్రప్రదేశ్ నగర వనాల లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో అడవులు, పులుల కారిడార్‌ను బలోపేతం చేయడానికి, తగ్గిన ఆవాసాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

--------------------------

నేరాల నియంత్రణలో సాంకేతికత వినియోగం చాలా కీలకమని ఆంధ్రప్రదేశ్ హోంశాఖమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఆమె నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల విషయంలో రాజీవద్దని పోలీసు అధికారులకు సూచించారు. చిన్నారులు, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీసీ టీవీలు, డ్రోన్ల వంటి నూతన సాంకేతిక పరికరాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే నేరాలను మరింత తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి 3 నెలలకోసారి శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పటిష్ట భద్రతతో శాసనసభ సమావేశాల నిర్వహణకు కృషి చేసిన పోలీసులందరిని ఆమె అభినందించారు.

---------------------------

తెలంగాణకు గ్రామీణ మౌలిక వసతుల నిధి – ఆర్ఐడీఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు – నాబార్డు ఛైర్మన్ కేవీ షాజీని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి కోరారు. శాసనసభ ప్రాంగణంలోని కార్యాలయంలో నిన్న ముఖ్యమంత్రిని షాజీ కలిశారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... సహకార సొసైటీలను బలోపేతం చేయాలని... కొత్త సొసైటీలు ఏర్పాటు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని షాజీ కేవీని రేవంత్ రెడ్డి కోరారు. ఐకేపీ, గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి.. రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకు సహకరించాలని కోరారు. కొత్త జిల్లాల్లో సీసీబీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి షాజీ కేవీ ప్రతిపాదించారు.

---------------------------

తెలంగాణలోని గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ రుసుము విధించే ఆలోచన లేదని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో నిన్న ఆయన మాట్లాడుతూ... కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్ రోడ్లు వేయిస్తామని మంత్రి తెలియజేస్తూ...,

వాయిస్ ..39 సెకన్లు

---------------------------

వికసిత్ భారత్ 2047లో భాగంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను జాతీయ రక్షణ కళాశాలకు చెందిన అధికారుల బృందానికి వివరించారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు పది సూత్రాల ప్రణాళికలో చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. మేజర్ జనరల్ సిపి సంగ్ర నేతృత్వంలోని జాతీయ రక్షణ అకాడమీ, డిఆర్డిఓ తదితర విభాగాలకు చెందిన అధికారుల బృందం అధ్యయన పర్యటనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమావేశం అయింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మామిడి రైతుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపడానికి రాష్ట్రంలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు కేంద్రాన్ని కోరారు. లోక్‌సభలో వ్యవసాయశాఖ బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో నిన్న ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మామిడి రైతులకు మరింత గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉక్రెయిన్ తోపాటు ఐరోపా దేశాలకు మామిడి గుజ్జు ఎగుమతుల్లో ఎదురవుతున్న చిక్కులు తొలగించాలని కోరుతూ...

వాయిస్ .. 38 సెకన్లు

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆదాయ వ్యయాలపై పారదర్శకత పాటిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసన సభలో బడ్జెట్ పై

చర్చకు నిన్న ఆయన సమాధానం చెబుతూ.. 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగా, వచ్చిన ఆదాయంలో వేతనాలకు 77వేల 3 వందల 42 కోట్లు రూపాయలను, రుణాలు, వాటిపై వడ్డీలకు 88 వేల కోట్లు చెల్లించామని తెలిపారు. లక్షా 34 వేల కోట్లను ఇతర పథకాల ద్వారా చెల్లింపులు చేశామని, ఏ పథకానికి ఎంత కావాలన్నది పక్కాగా లెక్కించి హామీలు అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిబంధనలు పాటించని నర్సింగ్ విద్యా సంస్థలకు నోటీసులు ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై సచివాలయంలో నిన్న ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నోటీసులు అందుకున్న విద్యా సంస్థలు లోపాలను జూన్ 15 నాటికి సవరించకుంటే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలకు అనుమతి ఇవ్వవద్దని వైద్య విద్యా సంచాలకులకు సూచించారు.

---------------------------

భూసంబంధిత సమస్యలను మూడునెలల్లోగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా తెలిపారు. విజయవాడలో నిన్న నిర్వహించిన రెవెన్యూ ఉన్నతాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డేటా ఎంట్రీలో ఖచ్చితత్వం కీలకమని, ఏవైనా నిర్లక్ష్యంగా, తప్పుగా నమోదు చేసినా ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. డిజిటల్ పాలన, సమర్థవంతమైన విధానాలు, ఖచ్చితమైన భూ రికార్డులు కీలకమన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు పారదర్శకత, ఖచ్చితమైన అమలు విధానం అవసరమని, జాయింట్ కలెక్టర్‌లు అన్ని అంశాలను నేరుగా పర్యవేక్షించాలని సూచించారు.

---------------------------

రాబోయే నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు వాతారణ శాఖ అంచనా తెలిపింది. మరోవైపు ఈరోజు విజయనగరం జిల్లాలో 7 మండలాలు, శ్రీకాకుళం జిల్లాలో 6, పార్వతీపురం మన్యం జిల్లాలో 5 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ పేర్కొన్నారు.

కాగా తెలంగాణా వ్యాప్తంగా వడగండ్ల వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగండ్లు కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ అధికారులు తెలిపారు.

======================